క్లుప్తంగా

దాసాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



తెనాలి: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యా పీఠంలో సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో శ్రీదాసాంజనేయ స్వామి 16వ వార్షికోత్సవ మహోత్సవాలను నిర్వహించారు. ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) స్వయం పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సింధూర అర్చన, హారతులు, మంత్రపుష్పం పూజలు చేశారు. 1108 వడలు, తమలపాకులతో పూజ చేశారు. ఈ సందర్భంగా బాలస్వామీజీ మాట్లాడుతూ ఆంజనేయస్వామి విశిష్టతను భక్తులకు తెలియజేశారు. ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, కార్యదర్శి రావూరి సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి ముద్దా భక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, లోకనాథం రాజేశ్వరరావు పర్యవేక్షించారు. పెద్దసంఖ్యలో మహిళలు పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: ప్రముఖ సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు పురస్కరించుకుని బండ్ల వెంకట్, జానీబాషా మిత్ర బృందం ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి వారి అన్నదాన కేంద్రంలో మంగళవారం పేదలకు, యాచకులకు అన్నదానం చేశారు. అలాగే అంగలకుదురులోని స్వధార్ హోంలోని విద్యార్థులు, వృద్ధులకు బ్యాగులు, డైనింగ్ చైర్స్, బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మాగాంధీ శాంతి ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జి.దినేష్, జి.భార్గవ్, జి.మణి గోపాల్, షేక్ బాషా తలైవా, వి.సూర్య, బాషాజాన్, పి.ఉదయ్ కుమార్, ఎం.నిఖిల్ సాయి పాల్గొన్నారు.

పనులు జరగడం లేదయ్యా



తెనాలిరూరల్: కూటమి ప్రభుత్వ హయాంలో తమకు పనులు జరగడం లేదని టీడీపీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా అయితే కార్యకర్తలను కాపాడుకోవడం కష్టమని వాపోయారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నియోజకవర్గ టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం ఇక్కడి ఎన్వీఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించారు. పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ పార్టీ అధికారంలో ఉన్నా తమకు ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు జరగడం లేదని, ఎవరిని సంప్రదించాలన్న గందరగోళం నెలకొందన్నారు. భవిష్యత్‌లో పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదముందని అభిప్రాయపడ్డారు. మహిళా కమిసన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, నన్నపనేని సుధాకర్, మహమ్మద్ ఖుద్దూస్, జొన్నాదుల మహేష్, వంగా సాంబిరెడ్డి ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



నగరం: నగరం శివారు గిరిపురంలో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుల పర్యవేక్షణలో వేదపండితులు వ్రత కార్యక్రమాలను శాస్త్ర యుక్తంగా జరిపారు. దంపతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

మొక్కుబడిగా సాగుతున్న హెల్త్ ఐడీలు

- మూడేళ్ల క్రితం కేంద్రం ఆదేశాలు
- ఇప్పటికీ పట్టించుకోని కొందరు అధికారులు
- ప్రైవేట్ ఆస్పత్రులలో కన్పించని హెల్త్ ఐడీ వ్యవస్థ
- నేటికీ నమోదు కాని కొందరి అనారోగ్య వివరాలు



జిల్లా వైద్యశాలలో హెల్త్ ఐడీ నమోదు చేయించుకుంటున్న రోగులు

తెనాలిఅర్బన్: కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (అభా) ఐడీ నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. దీనిని ప్రారంభించి మూడు సంవత్సరాలు దాటుతున్న నేటికీ కొందరి అనారోగ్య వివరాలు అకౌంట్‌లో కనిపించడం లేదు. అనుకోకుండా వారు అనారోగ్యంతో ఏదైనా ఆస్పత్రికి వెళ్తే వారి వివరాలు తెలియక వైద్యులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

దీర్ఘకాలిక వ్యాధులు, అనారోగ్యంతో బాధపడే వారి వివరాలు సులువుగా తెలుసుకునేందుకు కేంద్రం ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్‌ను 2022లో ప్రారంభించింది. ప్రభుత్వ, ప్రవేట్ వైద్యశాలలకు అనారోగ్యంతో వచ్చిన ప్రతిఒక్కరి వివరాలను ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్‌లో నమోదు చేసి వారికి ఐడీ క్రియేట్ చేయాల్సి ఉంటుంది. దీనికోసం రోగి తన ఆధార్ కార్డుతో పాటు దానికి లింక్ అయిన సెల్ నెంబర్‌ను తీసుకువెళ్లాల్సి ఉంటుంది. నూతనంగా క్రియేట్ అయిన ఐడీ నెంబర్ ఆధారంగా వారికి ఓపీ చీటీలు వ్రాసి వైద్యులు వారికి చికిత్స అందించి వాటి వివరాలు అభా యాప్‌లో పొందుపరుస్తారు. ఇలా చేయడం వల్ల అనుకోకుండా వారికి అత్యవసర వైద్యం అందించాల్సి వస్తే వారి ఆధార్ నెంబర్‌ను అభా యాప్‌లో ఎంటర్ చేయగానే వారు ఇప్పటి వరకు ఏ వ్యాధికి ఏ ఆస్పత్రిలో చికిత్స పొందారు అనే విషయం తెలుస్తోంది. దీనివల్ల వెంటనే వారికి సరైన వైద్యం అందే అవకాశం ఉంటుందని కేంద్రం భావించి దీనిని ప్రవేశపెట్టింది.

ప్రభుత్వ వైద్యశాలలకే పరిమితమైన నమోదు

పట్టణంలో ఒక జిల్లా వైద్యశాల, తల్లిపిల్లల వైద్యశాల, ఆరు అర్బన్ హెల్త్ సెంటర్‌లు, తెనాలి డివిజన్‌లో 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. కేంద్రం అభా వ్యవస్థను ఏర్పాటు చేయగానే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ వైద్యశాలల అధికారులు దీనిని అమలు చేస్తున్నారు. అనుకోకుండా ఎవరైన ఆధార్‌కార్డు, ఫోన్ వెంట తెచ్చుకోకపోతే అలాంటి వారికి మినహా మిగిలిన అందరికీ అభా ఐడీలను క్రియేట్ చేసి చికిత్స అందిస్తున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో రోజుకు సగటున తెనాలి డివిజన్‌లో 2500 మంది ఐడీలు క్రియేట్ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



ఐడీ క్రియేట్ చేయించుకునేందుకు క్యూలో ఉన్న రోగులు

ప్రైవేట్ వైద్యశాలలో కనిపించని నమోదు

వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల లెక్కల ప్రకారం తెనాలి పట్టణంలో 39 ప్రైవేట్ వైద్యశాలలు ఉన్నాయి. కేంద్రం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ల నమోదు ప్రక్రియ ప్రారంభమై మూడు సంవత్సరాలు దాటినా నేటికీ ప్రైవేట్ వైద్యశాలలో ఇది కనిపించటం లేదు. వైద్యశాలలకు వచ్చిన రోగికి ఓపీ చీటీ వ్రాసి వైద్యుల వద్దకు పంపుతున్నారు. దీనివలన అభా యాప్‌లో రోగి వివరాలు నమోదు కావడం లేదు. కనీసం వైద్యశాలల నిర్వాహకులు దీనిపై దృష్టి పెట్టటం లేదు. ఇంత జరుగుతున్నా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు కూడా వారికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి ఐడీల నమోదుకు చర్యలు తీసుకోవటం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారినట్లు అవుతుంది. ఇప్పటికైన పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఐడీల నమోదును ప్రైవేట్ వైద్యశాలలో ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది.

అభా ఐడీలను అందరూ క్రియేట్ చేయాలి



కేంద్రం 2022లో ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్‌లు క్రియేట్ చేయాలని ఆదేశించింది. ఆ సమయంలోనే అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలలకు ప్రభుత్వ ఆదేశాలను తెలియజేశాం. అన్ని ప్రభుత్వ వైద్యశాలలో అభా ఐడీలను క్రియేట్ చేసి రోగుల వివరాలు నమోదు చేస్తున్నారు. ప్రైవేట్ వైద్యశాలలో కూడా దీనిని తప్పనిసరిగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

–డాక్టర్ ఈ.అన్నపూర్ణ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో, తెనాలి.

మండల పరిసర ప్రాంతాల్లో విభిన్న ప్రతిభావంతుల సర్వే

చుండూరు(వేమూరు): మండల పరిసర ప్రాంతాలలో విభిన్న ప్రతిభావంతులను సర్వే చేయడం జరుగుతుందని భవిత కేంద్రం ఉపాధ్యాయులు ఎస్.శివకుమార్, ఎం.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయం ఆదేశాల మేరకు మండలంలోని 18 గ్రామాల్లో విభిన్న ప్రతిభావంతుల పిల్లల సర్వే ఈ నెల 13న ప్రారంభమైందని, జూన్ 9వ తేదీ వరకు సర్వే చేయడం జరుగుతుందన్నారు. 3 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలను ఇంటింటా సర్వే చేసి విభిన్న ప్రతిభావంతులను గుర్తించే కార్యక్రమం జరుగుతుందన్నారు. గుర్తించిన పిల్లలను మున్నంగి వారిపాలెంలోని భవిత కేంద్రంలో చేర్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.జ్యోత్స్న, సిబ్బంది పాల్గొన్నారు.



విభిన్న ప్రతిభావంతుల సర్వే చేస్తున్న ఉపాధ్యాయులు

జూదరుల అరెస్ట్

తెనాలిరూరల్: పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ పోలీసులు దాడులు నిర్వహించి జూదరులను అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని అంగలకుదురు గ్రామంలో రైలు పట్టాల సమీపంలో మంగళవారం పేకాట ఆడుతుండగా రూరల్ ఎస్ఐ ఆనంద్ తమ సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ. వెయ్యి స్వాధీనం చేసుకున్నారు.

గుండెపోటుతో శానిటరీ ఉద్యోగి మృతి



మృతి చెందిన అంకయ్య

వేమూరు: పోన్నూరు అంకయ్య(61) గుండె పోటుతో మృతి చెందాడు. తెనాలి మున్సిపాలిటీ శానిటేషన్ విభాగంలో ఉద్యోగం చేస్తున్న పొన్నూరు అంకయ్య జంపని గ్రామంలో డంపింగ్ యార్డు వద్ద పడి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అంకయ్యకు గుండె జబ్బు ఉందని, కొంత కాలంగా మందులు వాడుతున్నాడని తెలిపారు. సోమవారం రాత్రి జంపని గ్రామంలో డంపింగ్ యార్డు వద్ద ఇనుప రాడ్లు ఏరుతూ మృతి చెందడం జరిగిందని ఎస్సై రవికృష్ణ మంగళవారం తెలిపారు. తెనాలి పట్టణం యానాది కాలనీ చెందిన అంకయ్య సోమవారం ఇనుప రాడ్ల కోసం జంపని వచ్చాడని, డంపింగ్ యార్డు పక్కన మృతి చెంది ఉండటాన్ని గుర్తించడం జరిగిందన్నారు. మృతుడికి ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. కుమారుడు సుబ్రమణ్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించడం జరిగిందని ఎస్సై చెప్పారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

తాడేపల్లి రూరల్: ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం శాఖ మహాసభ శీలం శ్యామ్ అధ్యక్షత నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించిందని విమర్శించారు. 50 ఏళ్లుగా నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో నివాసాలు ఉంటున్న వారికి మంత్రి లోకేష్ పట్టాలు ఇస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చారని.. హామీలో భాగంగా తొలి విడతగా కొన్ని పట్టాలు ఇచ్చారని, అందరికీ న్యాయం చేకూర్చాలని కోరుతున్నామన్నారు. అనంతరం సీతానగరం సీపీఐ శాఖ కార్యదర్శిగా శీలం శ్యామ్ ప్రసాద్, కమిటీ సభ్యులుగా చలవాది గౌరి, శీలం అనిల్, చలువాది బోసు, పాలగర్ల తిరుపతమ్మలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమల్ల వెంకటయ్య, సీనియర్ నాయకులు మానికొండ డాంగే, మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

న్యాయస్థానం తీర్పును అమలు చేయాలి

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా కోర్టులు ఇచ్చిన తీర్పులను అమలు చేయాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులు వై.సాంబయ్య, తుపాకుల నాగేశ్వరరావుతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. చట్టప్రకారం తమకు రావాల్సిన బకాయిల కోసం కార్మికులు దీక్షలు చేస్తున్నారని, ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకపోవడం విచారకరమని అన్నారు. మంత్రి లోకేష్ ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్.కె ఖాసిం, గురవయ్య, నాగేశ్వరరావు, సుభాని, ఇస్మాయిల్, ఇమాంబి, దుర్గ, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డు స్పెషల్ డ్రైవ్‌ను వినియోగించుకోవాలి

మంగళగిరి టౌన్: రేషన్ కార్డులకు సంబంధించిన 7 రకాల సేవలను ప్రజలు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో వినియోగించుకోవాలని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ కె.శకుంతల మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 21 నుంచి ఈనెల 27వ తేదీ వరకు ఈ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, కార్యక్రమంలో కొత్త బియ్యం కార్డు, బియ్యం కార్డులో సభ్యుల చేరిక, విభజన, సభ్యుల తొలగింపు, కార్డు సరెండర్, చిరునామా మార్పు, ఆధార్ ఫీడింగ్ సరిచేయుట వంటి 7 రకాల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. మంగళగిరి పట్టణ, మండల పరిధిలోని ప్రజలు స్పెషల్ డ్రైవ్ వివరాల కోసం తమ దగ్గరలోని సచివాలయాలను సందర్శించాలని కోరారు. ఆయా సచివాలయాల సిబ్బంది కార్యక్రమాలు పూర్తయ్యే వరకూ ఎలాంటి సెలవులు పెట్టవద్దని ఆమె పేర్కొన్నారు. మంగళగిరి డివిజన్‌కు డీఈఈ సీహెచ్ రమేష్‌బాబు, తాడేపల్లి డివిజన్‌కు డీఈఈ కె.రాములను ఆయా సచివాలయాల పరిధిలో ప్రజలకు, సిబ్బందికి ఏర్పాట్లు చేయవల్సిందిగా ఆ ప్రకటనలో ఆదేశించారు.

అభయాంజనేయుడికి విశేష పూజలు

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం అడ్డరోడ్డు వద్దనున్న అభయాంజనేయస్వామికి హనుమజ్జయంతి సందర్భంగా మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. నూతన వస్త్రాలతో స్వామిని అలంకరించి నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్ర నామ పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు రామ కోటేశ్వరరావు, నాగ మల్లేశ్వరరావులు పర్యవేక్షించారు.



కోర్టు వాయిదాలకు రాని నిందితుడు అరెస్టు

మంగళగిరి: కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని అరెస్ట్ చేసినట్లు మంగళగిరి ఎస్ఐ సీహెచ్ వెంకట్ తెలిపారు. విజయవాడ కొత్తపేటకు చెందిన సింహ దుర్గారావు కోర్టు వాయిదాలకు హాజరు కావడంలేదని జడ్జి నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేశారన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు నిందితుడు దుర్గారావును మంగళవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరుచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

బిజిలి యోజన కింద సోలార్ ప్యానల్స్ ఏర్పాటు



మాట్లాడుతున్న ఎంపీడీవో సుదీప

చుండూరు(వేమూరు): బిజిలి యోజన కింద రూఫ్ టాప్ సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎంపీడీవో సుదీప తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో విద్యుత్ శాఖ, డీఆర్‌డీఏ వెలుగు సిబ్బందితో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మండలానికి ఎస్సీ, ఎస్టీ, గృహాలకే కాకుండా 1500 యూనిట్లు బీసీ, ఓసీలకు సబ్సిడీపై అందించడం జరుగుతుందన్నారు. చుండూరు మండలంలోని యడ్లపల్లి గ్రామం మోడల్ సోలార్ గ్రామంగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. ప్రతి ఇంటిపై సోలార్ యూనిట్లను ఏర్పాటు చేయాలని ఆమె చెప్పారు. యూనిట్ ధర రూ.2,10,000 కాగా లబ్ధిదారు చెల్లించవలసింది రూ.20,000, సబ్సిడీ రూ.78,000, బ్యాంక్ లోన్ ద్వారా రూ.1,12,000 ఇవ్వడం జరుగుతుందన్నారు. సోలార్ ప్యానల్స్ కావాల్సిన వారు పేర్లు ఆన్‌లైన్ చేసుకోవాలని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని నిరసన



రైల్వే గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

వేమూరు: కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి కేంద్ర ప్రభుత్వం తెస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకుడు బి.అగస్టీన్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక రైల్వే గేటు సెంటర్‌లో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎన్నో సంవత్సరాలు పోరాడి సాధించుకున్న చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లు తెస్తుందన్నారు. లేబర్ కోడ్ అమలు జరిగితే కార్మికులకు చట్టాలు వర్తించవని, కార్మికులు బానిసత్వంలోకి నెట్టబడతారని, కనీసం సంఘం పెట్టుకునే హక్కు పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వం రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, ముఠా, రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, స్కీమ్ వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9న జరిగే జాతీయ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వేమూరి విజయరాజు, వేమూరి యోహాను, సురేష్, దుర్గ, భార్గవి తదితర కార్మికులు పాల్గొన్నారు.

లింగ వివక్షను సమూలంగా రూపుమాపాలి



మాట్లాడుతున్న సీడీపీవో సుచిత్ర

రేపల్లె: సమాజంలో నెలకొన్న లింగ వివక్షను కూకటి వేళ్లతో సహా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సీడీపీవో సుచిత్ర తెలిపారు. లింగ వివక్షత నిర్మూలనకై పట్టణ, మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం కిశోరి వికాసం సమ్మర్ ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 8, 9 వార్డుల అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. సమాజంలో పురుషులు మహిళలు సమానమేనన్నారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణిస్తున్నారని చెప్పారు. మహిళా అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. మహిళల్లో కిశోర దశ ముఖ్యమైనదన్నారు. తల్లిదండ్రులు కిశోర బాలికల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని స్నేహపూరిత వాతావరణంలో బాలికలకు సూచనలు చేయాలని చెప్పారు. కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా కృషి చేయాలని అన్నారు. బాలికల సంరక్షణకై ముఖ్యంగా లింగ వివక్షను రూపుమాపేందుకు ప్రభుత్వం చేసిన చట్టాలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శివ జ్యోతి, మహిళా సంరక్షణ కార్యదర్శి హరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

వెబ్ డెవలపర్ శిక్షణ తరగతులు ప్రారంభం



శిక్షణకు హాజరైన విద్యార్థులు

రేపల్లె: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా రేపల్లెలోని ఏబీఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్‌లో శిక్షణ తరగతులు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. వెబ్ డెవలపర్ కోర్సు ప్రారంభించగా, అకౌంట్స్ అసిస్టెంట్ కోర్సు తరగతులు గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సి.రవిచంద్రకుమార్ తెలిపారు. మూడు నెలల పాటు నిర్వహించే ఈ కోర్సులలో నిరుద్యోగ అభ్యర్థులకు పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించనున్నామన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులకు నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నుంచి సర్టిఫికెట్లు అందించబడతాయన్నారు. అర్హతలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించబడతాయని పేర్కొన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి, ఇంటర్, ఏదైనా డిగ్రీ ఆపైన చదివిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9347468946ను సంప్రదించాలన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

పొన్నూరు: మైనర్లు ద్విచక్ర వాహనాలు నడిపితే తగిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ వీరానాయక్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఐలాండ్ సెంటర్‌లో మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు నడుపుతున్న పలువురు మైనర్లను ఆపి వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. రోజు రోజుకూ ట్రాఫిక్ పెరుగుతున్న తరుణంలో మైనర్లు వాహనాలు నడపడం ప్రమాదకరం అన్నారు. వారు ద్విచక్ర వాహనాలు నడిపే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించవద్దని తెలిపారు.